క్లుప్తంగా

హెపటైటిస్‌పై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న రాయపాటి శ్రీనివాస్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు హెపటైటిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని లయన్స్ అడిషనల్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ హెపటైటిస్ డేను పురస్కరించుకుని స్థానిక వెంకటరమణ కాలనీలోని కేఎస్ఆర్ స్కూల్ ఆవరణలో 9,10వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెపటైటిస్ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి మాట్లాడుతూ కాలేయ వ్యాధులైన హెపటైటిస్ బీ,సీ వ్యాధులపై అవగాహన కోసం ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మెల్విన్ జోన్స్ కార్యదర్శి సి.గోవర్ధన్‌రెడ్డి, కేఎస్ఆర్ స్కూల్ కరస్పాండెంట్ గోపీనాథ్, పవన్, మంజునాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ ఉద్యోగులకు- 2022 పీఆర్‌సీ అమలు చేయాలని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గణేష్ డిమాండ్ చేశారు. శక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ భవన్‌లో మధ్యాహ్న భోజన సమయంలో చేపడుతున్న నిరసన రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పీఆర్‌సీ కోసం విన్నపాలు చేస్తున్నా పంపిణీ సంస్థలు పట్టించుకోవడం లేదన్నారు. దీనిని పరిష్కరించని పక్షంలో దశలవారిగా ఆందోళనలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రంగస్వామి, ఇతర సంఘాల నాయకులు కృష్ణయ్య, రామరాజు, ఆనంద్ దేవ్‌పాల్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.


సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కర్నూలు(రూరల్): హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, రాముడు డిమాండ్ చేశారు.ఈ అంశంపై శుక్రవారం నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మార్కెట్ యార్డ్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడుతూ... శ్రమను నమ్ముకొని జీవిస్తున్న హమాలీ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ హమాలీ కార్మిక సంఘం కార్యదర్శి బీసన్న, కోశాధికారి రామకృష్ణ, వెంకటస్వామి, మౌలాలి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగర పాలక సంస్థలో పనిచేసే క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆ యూనియన్ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.... నగర పాలక సంస్థలో పని చేస్తున్న క్లాప్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, కనీస వేతనం రూ 18,500 ఇవ్వాలని, ఆప్కాస్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను మంజూరు చేసి, యాజమాన్యం వేధింపులను ఆపాలన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి రామాంజనేయులు, నరసింహులు, సుధాకరప్ప, మైమూద్, కుమార్, రఘు, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల బంద్ ప్రశాంతం



జూనియర్ కళాశాలలను బంద్ చేయిస్తున్న ఏబీవీపీ నాయకులు

కర్నూలు కల్చరల్: భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన జూనియర్ కళాశాలల బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ బాబ్జి గౌడ్ మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో ఉన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీని పట్టించుకోవడం లేదన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో అధికె ఫీజుల వసూలు వసూలు చేస్తున్నా, ఎలాంటి అనుమతులు లేకుండా జేఈఈ, నీట్ పేర్లతో కోచింగ్‌లు నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రిస్వామి, నాయకులు కార్తీక్ సింగ్, అజయ్, వినోద్, గౌతమ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న సురక్ష కార్యక్రమం ఉద్దేశమదే
- ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- దరఖాస్తుదారులకు వివిధ సర్టిఫికెట్ల పంపిణీ



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, నియోజకవర్గ పరిశీలకుడు కర్రహర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం అందులో భాగమేనని చెప్పారు. శుక్రవారం నగరంలోని 5 వ వార్డు 11 వ వార్డు 16 వ వార్డు 25 వ వార్డు పరిధిలోని 12, 13, 26, 38 39, 63, 64,131, 132 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజలకు వారు నివసించే ప్రాంతాల్లోనే అవసరమైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందని, గడప వద్దకే సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేక ఇబ్బంది పడుతున్న వారికి వెంటనే వాటిని అందించేందుకు సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నెలరోజుల పాటు జరిగే ఈకార్యక్రమంలో 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో నగరంలో కొందరు రోడ్ల మీదకు వస్తున్నారన్నారు. అది చేస్తాం.. ఇది చేస్తామంటున్నారని, ఇంత కాలం వారు ప్రజలకు ఏ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం దరఖాస్తుదారులకు జనన, మరణ, ఆదాయ, వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ, ఫ్యామిలీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు అబ్జర్వర్ కర్ర హర్షవర్ధన్ రెడ్డి, నగర అద్యక్షురాలు సత్యనారాయణమ్మ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ స్థానిక కార్పొరేటర్లు , వార్డు ఇన్‌చార్జ్‌లు, స్పెషల్ ఆఫీసర్లు, సచివాలయాల సిబ్బంది, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక 11వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఖడక్‌పురా వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలు, వర్గాలకు తావు లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్, పార్టీ నాయకులు నూరుల్లా ఖాద్రీ, ఫైజల్‌ఖాన్, జుబేర్, దాదూద్, షబ్బీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఇక ఏకగ్రీవమే!

- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు
- పోటీ నుంచి తప్పుకున్న ఐదుగురు
- వచ్చే నెల 1 న అధికారికంగా వెల్లడి



నామినేషన్ ఉపసంహరించుకుంటున్న 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతి

కర్నూలు (టౌన్) : కర్నూలు నగరపాలక స్టాండింగ్ కమిటీలో ఐదుస్థానాలకు పదిమంది కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ఐదుగురు తప్పుకోవడంతో ఏకగ్రీవానికి లైన్ క్లియర్ అయ్యింది. నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికకు ఈనెల 18 వ తేదీ మున్సిపల్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. 52 వార్డులు ఉన్న నగరపాలక సంస్థకు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఐదుగురు కార్పొరేటర్లకు అవకాశం ఉంది. ఎన్నికైన వారు ఏడాది పాటు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా కొనసాగుతారు. అయితే అధికార పార్టీలో ఆశావాహులు ఎక్కువగా ఉన్నారు. దీంతో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అన్నెపోగు క్రాంతి, చిన్నబోయిన సాంబశివరావు, సంగాల సుదర్శన్ రెడ్డి, ఆత్మకూరు నాగలక్ష్మీరెడ్డి, నగరూరు శ్రీనివాసరావు, కె. పద్మాలతారెడ్డి, జీవీఎల్ సుజాత, పి.షాషావలి, షేక్ యూనస్ బాషా, సోంపల్లి క్రిష్ణకాంత్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని ఇద్దరిని, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ముగ్గురిని ప్రతిపాదించారు. అయితే, వీరితో పాటు మరో ఐదుగురు బరిలో దిగారు. ఈ ఐదుగును నామినేషన్లు ఉపసంహరించుకునే విధంగా నేతలు రంగంలోకి దిగారు. కార్పొరేటర్ల మధ్య సయోధ్య కుదిర్చారు. దీంతో నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు అయిన శుక్రవారం అన్నెపోగు క్రాంతి, చిన్న బోయిన సాంబశివరావు, పి. షాషావలి, షేక్ యూనస్ బాషా, సోంపల్లి క్రిష్ణకాంత్ రెడ్డి తప్పుకున్నారు. దీంతో ఏకగ్రీవానికి లైన్ క్లియర్ అయ్యింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో ప్రస్తుతం బరిలో ఉన్న ఐదుగురు కార్పొరేటర్లు సంగాల సుదర్శన్‌రెడ్డి, ఆత్మకూరు నాగలక్ష్మీరెడ్డి, నగరూరు శ్రీనివాసరావు, కైపా పద్మాలతారెడ్డి, జీవీఎల్ సుజాత ఎన్నిక ఇక లాంఛనమైంది. అయితే, షెడ్యూల్ ప్రకారం ఈ నెల 1వ తేదీన వారి పేర్లను అధికారికంగా ప్రకటిస్తారు.

కాలేయ మార్పిడి యూనిట్ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కాలేయ మార్పిడి యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తానని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ చెప్పారు. వరల్డ్ హెపటైటిస్ డేను పురస్కరించుకుని శుక్రవారం ఆసుపత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ మాట్లాడుతూ హెపటైటిస్ వ్యాధులకు ఖరీదైన మందులను పేదలకు ఉచితంగా అందజేయడం అభినందనీయమన్నారు. దీంతో పాటు ఉచితంగా హెపటైటిస్-బి,సి వైరస్‌ల నిర్ధారణ పరీక్షలు కూడా ఇక్కడ చేస్తున్నారన్నారు. అవగాహన లేకపోవడంతో హెపటైటిస్ వ్యాధులు వస్తున్నాయని, ఈ మేరకు వైద్యులు ఈ వ్యాధిపై విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ హెపటైటిస్, కాలేయ వ్యాధులను ప్రజలు ప్రాథమిక స్థాయిలో గుర్తించి వైద్యం చేయించుకోవాలని సూచించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ కాలేయ వ్యాధులతో ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా 13లక్షల మంది, మన దేశంలో లక్ష మంది మరణిస్తున్నారని చెప్పారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి వచ్చే వారిలో సగం మంది కాలేయ జబ్బులతోనే వస్తున్నారని తెలిపారు. వారికి వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్నదని, హెపటైటిస్ బి,సి వ్యాధిగ్రస్తులకు ఖరీదైన మందులతో పాటు ఇమ్యునోగ్లోబ్లిన్స్‌ను సైతం ఉచితంగా అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ మోహన్ రెడ్డి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మహేశ్వరరెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ బ్లెస్సీ పాల్గొన్నారు.

స్పోర్ట్స్

రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపిక

కర్నూలు(రూరల్): ఈ నెల 29,30 తేదీల్లో గార్గేయపురంలో జరిగే రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు నగరంలోని సంకల్ బాగ్‌లో ఉన్న చిన్మయ మిషన్ విద్యాలయం విద్యార్థులు ఎంపికైనట్లు హెడ్ మాస్టర్ స్వర్ణలత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పతకాలతో తిరిగి రావాలని ఆమె ఆకాంక్షించారు.

30న జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు(రూరల్): నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 30వ తేది ఉదయం 9 గంటలకు జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 90309 00569 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మికం

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన

కర్నూలు కల్చరల్: అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో మొదటి రోజు గణపతి పుణ్యాహవచనం, మంటపారాధన, కలశ స్థాపన, శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహా యజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ మాట్లాడారు.

హరినామ సంకీర్తనతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శుక్రవారం హరినామ సంకీర్తన ఉత్సవం ప్రారంభమైంది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రామకృష్ణ ప్రభు సందేశమిచ్చారు. హరినామ సంకీర్తన చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సంకీర్తన ఉత్సవం ప్రతి రోజు సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు జరుగుతుందన్నారు. స్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసం చేస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వర కుమార్ హెచ్చరించారు. శుక్రవారం కర్నూలు కొత్త బస్టాండ్‌లోని ఎరువుల గోడౌన్, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఎరువుల బస్తా 50 కేజీలకుగాను 48 కేజీలే ఉండటంతో సదరు దుకాణ యజమానిపై కేసు నమోదు చేశారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి

కర్నూలు(రూరల్): కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీపీఎం జిలా కార్యదర్శి గౌస్ దేశాయ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కడపలో పరిశ్రమ ఏర్పాటుకు అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేవని ఇటీవల పార్లమెంట్‌లో కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి తెలియజేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఉక్కు పరిశ్రమ కోసం ఈ నెల 31 న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

రేపటి కార్యక్రమాలు

టీటీడీ కథల పోటీలు

కర్నూలు కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సమన్వయ కర్త డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో దేశ భక్తి, దైవ భక్తి, సనాతన భారతీయ విలువలు, వ్యక్తిత్వ వికాసంతో పాటు వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ' కథ చెబుతారా ఊ కొడతాం' అనే శీర్షికతో పోటీలు నిర్వస్తున్నట్లు పేర్కొన్నారు. 30వ తేదీ ఉదయం 9 గంటలకు నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని శ్రీసుధ విద్యాలయంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. పదేళ్ల లోపు బాలబాలికలు ఒక విభాగంగా, 10 నుంచి 15 ఏళ్ల లోపు వారికి మరో విభాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు విభాగాల్లో ప్రథమ బహుమతి రూ.1000 ద్వితీయ బహుమతి రూ.750, తృతీయ బహుమతి రూ. 500 నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. వివరాలకు 9059802265 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నగర సాంఘిక్‌ను ఈనెల 30వ తేదీ ఉదయం 7 గంటలకు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా బాబారాందేవ్ పతంజలి యోగా భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా ప్రభావరి ఎస్.వి. శివరాజ్, ముఖ్య వక్తగా విభాగ్ సంఘ చాలక్ బర్రెంకల నీలకంఠ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అన్ని ఉప బస్తీల కార్యకర్తలు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎస్టీయూ సమావేశం

కర్నూలు కల్చరల్: రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో జరుగుతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టి.కె.జనార్ధన్ తెలిపారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న హాజరవుతారని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): ఇళ్లు, పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం బాగుంటుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని తప్పెట గేరి సచివాలయంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు గృహ సందర్శనాలు చేసి నీటినిల్వలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల పెరుగుదలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎవ్వరికైనా జ్వరలక్షణాలు కనిపిస్తే వారికి వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసి తగు చికిత్సలు ఇవ్వాలన్నారు. ఆ వివరాలను ఫ్రైడే డ్రైడే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, అంతేగాక నీటి నిల్వలు, చెత్తకుప్పలు ఉన్న ప్రాంతాలను ఫొటో తీసి వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి, పంచాయతీ, మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో వాటిని తొలగించేలా చూడాలన్నారు. సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలు ఏదైనా కారణం వల్ల ఇవ్వకపోతే ఆగష్టు 7 నుంచి 12వ తేదీ వరకు జరిగే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలకు, గర్భిణిలకు టీకాలు వేయించాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మౌనిక, డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబిలైజర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, చిత్రంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(సెంట్రల్) : మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ డిమాండ్ చేశారు. అక్కడ మహిళలపై జరుగుతున్న దాడులను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మణిపూర్‌లో మైనార్టీలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. అక్కడ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అల్లర్లను అదుపు చేయకపోగా వారి మధ్య చిచ్చుపెడుతుందన్నారు ఓట్ల కోసం కులాలు, మతాలు, వర్గాల మధ్య గొడవ పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

తప్పిపోయిన విద్యార్థులు దొరికారు

కర్నూలు(టౌన్) : ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 23వ తేదీన తప్పిపోయిన ఇద్దరు విద్యార్థులు దొరికారు. సాయి మణిదీప్, శివప్రసాద్ అనే ఇద్దరు విద్యార్థులు స్థానిక సీరాక్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు. వీరు ఈనెల 23న స్కూల్‌కు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వెళ్లకుండా రైలులో మహారాష్ట్రకు వెళ్లారు. రాత్రైనా పిల్లలు ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు పోలీసులకు సమాచారమిచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేశారు. కర్నూలు రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. తర్వాత వారు మహారాష్ట్రలో ఉన్నట్లు సమాచారం లభించడంతో అక్కడికి వెళ్లి శుక్రవారం కర్నూలుకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. క్షేమంగా పిల్లలు ఇంటికి చేరుకోవడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

కర్నూలు(టౌన్) : స్థానిక విఠల్ నగర్ సమీపంలోని రైల్వే ట్రాక్ పక్కన వేప చెట్టుకు గుర్తు తెలియని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు నాలుగో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు పెద్దాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే నాల్గవ పట్టణ సీఐ శంకరయ్య సెల్ నంబర్ 9121101062కు తెలియజేయాలన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

- మణిపూర్‌లో క్రైస్తవులను జరుగుతున్న దాడులును నివారించాలని డిమాండ్



కలెక్టరేట్‌కు వద్ద నిరసన తెలుపుతున్న క్రైస్తవ సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులకు నిరసనగా కర్నూలులో క్రైస్తవులు శాంతి ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం సమైక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు నుంచి కలెక్టరేట్ వరకు జరిగిన ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. తక్షణమే మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నివారించాలని కోరుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారతదేశం లౌకిక దేశమని, ఇక్కడ అన్ని మతాలు, కులాలు సమానమేనని ర్యాలీలో పాల్గొన్న వివిధ చర్చిల పాస్టర్లు చెప్పారు. అయితే మణిపూర్‌లో క్రైస్తవులను లక్ష్యంగా చేసుకొని కొన్ని వర్గాలు దాడులు చేయడం హేయమని, మహిళలను వివస్త్రలను చేసి అత్యంత కిరాతకంగా హింసించి చంపడం దారుణమన్నారు. దేశంలో నెలకొన్న ఈ పరిస్థితిని చూసి ప్రపంచ దేశాలు నవ్వుకోక ముందే ప్రధానమంత్రి నరేంద్రమోదీ మేల్కొవాలన్నారు. దేశంలో అన్ని కులాలు, మతాలను సమానంగా చూడాలని, ఓట్ల రాజకీయాలను పక్కన పెట్టి దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు. శాంతి ర్యాలీలో ఆర్‌సీఎం చర్చి పాస్టర్ చౌరప్ప, కోల్స్ స్టాంటన్ చర్చి పాస్టర్ దేవ సహాయం, సీఎస్ఐ చర్చి పాస్టర్ రవికుమార్, ఏబీఎం బాప్టిజం చర్చి పాస్టర్లు ప్రసన్నబాబు, కేజే విజయకుమార్, సిలోవి చర్చి పాస్టర్ అస్కనాత్, క్రిస్టియన్ బాప్టిస్టు ఎస్‌కే జయాకర్, బాపిస్టు చర్చి పాస్టర్లు ప్రభుదాసు, రాజేష్, జాస్వా దానియేల్ పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి నీటి విడుదల

హొళగుంద(కర్నూలు): కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌లోని తుంగభద్ర రిజర్వాయర్ నుంచి దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు శుక్రవారం ఉదయం 10 గంటలకు టీబీ బోర్డు అధికారులు నీటిని విడుదల చేశారు. అదేవిధంగ హెచ్ఎల్సీ(ఎగువ కాలువ)కి కూడా నీటిని వదిలారు. ఈ సందర్భంగా టీబీ డ్యాంలో ప్రత్యేక పూజలు చేసిన టీబీ బోర్డు సెక్రటరీ నాగమోహన్, ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లెల్సీ ఈఈ నీలకంఠ రెడ్డిరెడ్డి ఇతర ఇంజనీయర్లతో కలిసి పసవర్ కెనాల్ (ఎల్లెల్సీ)కు గేట్ స్విచ్ ఆన్ చేసి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నీరు డ్యాం నుంచి 20 కి.మీ దూరంలోని గుండ్లకెరె(చెరువు)కు చేరి అక్కడ నుంచి ఎల్లెల్సీకి విడుదలవుతాయి. ఈ నెల ఖరు నాటికి నీళ్ల ఆంధ్రకు చేరనున్నాయి.